నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, సోమవారం 15 జూలై 2024 | NIZAMABAD



బతుకమ్మ కుంట కాలనీలో..

పంచముఖి హనుమాన్ కాలనీలో ఇండ్ల ఎదుట ఉన్న నీటి డ్రమ్ములు

# తాగునీటికి కటకట

## కామారెడ్డి మున్సిపాలిటీలో నీటి కష్టాలు

- ఇబ్బందుల్లో పలుకాలనీలు
- ఐదు రోజులకోసారి సరఫరా
- ప్రభుత్వ సలహాదారు ఇంటికి సమీపంలోనే నీటి కొరత

***పదేండ్ల కిందట** దర్శనమిచ్చిన డ్రమ్ములు, నీటి ట్యాంకర్లు మళ్లీ కనిపిస్తున్నాయి. కామారెడ్డి పట్టణంలోని పలు కాలనీల్లో తాగునీటి ఎద్దడి నెలకొన్నది. కొన్ని ప్రాంతాల్లో ఐదురోజులకోసారి, మరికొన్ని చోట్ల వారానికి రెండుసార్లు మాత్రమే నీటి సరఫరా అవుతున్నది. కామారెడ్డి మున్సిపాలిటీలోని ప్రజలు నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి సరఫరాలో ఇబ్బందులు, పైపులైన్ లీకేజీ తదితర సమస్యలు అధికంగా ఉంటున్నాయి.*

*– కామారెడ్డి, జూలై 14*

**కామారెడ్డి** పట్టణంలో తెలంగాణ రాక ముందు చాలా కాలనీల్లో నీటి సమస్యలు చాలా ఉండేవి. రోడ్లపై నీటి డ్రమ్ములను ఏర్పాటు చేసుకొని మున్సిపల్ నీరు వచ్చే వరకు ఎదురుచూసే వారు. 2014లో రాష్ట్రం వచ్చిన తర్వాత అప్పటి సీఎం కేసీఆర్ గ్రామాలు, పట్టణాల్లో మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నీటిని సరఫరా చేశారు. కామారెడ్డి పట్టణంలోని చాలా కాలనీల్లో నీటి సమస్య లేకుండా చేశారు. కానీ ఇటీవల నీటి కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. సాక్షాత్తూ ప్రభుత్వ సలహాదారు ఇంటికి కూత వేటు దూరంలోనే నీటి సమస్య అధికంగా ఉన్నది. అధికార పార్టీకి చెందిన నేత ఇంటికి సమీపంలోని కాలనీల పరిస్థితి ఇలా ఉంటే.. మిగతా కాలనీల్లో సమస్య ఎంత మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదిలా ఉండగా ఇటీవల నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశంలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ నీటి సమస్యపై యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే.

### 10 ఎంఎల్‌డీ బదులు 3ఎంఎల్‌డీ సరఫరా..

కామారెడ్డి పట్టణంలో సుమారు లక్షా 20 వేల మందికి మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా చేపడుతున్నారు. ఇందుకోసం 10 ఎంఎల్‌డీ నీరు అవసరం ఉండగా 3 ఎంఎల్‌డీ మాత్రమే సరఫరా చేస్తున్నారు. పట్టణంలోని పంచముఖి హనుమాన్ కాలనీ, బతుకమ్మ కుంట కాలనీలో ఐదు రోజులకోసారి నీటిని విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొంత మంది కౌన్సిలర్లు ట్యాంకర్ ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో చాలా మంది కాలనీవాసులు డ్రమ్ముల ద్వారా నీటిని నింపుకొని వాడుకుంటున్నారు. పట్టణంలో ప్రజలకు సరిపోయేలా నీటి సరఫరా లేకపోవడంతో చాలా మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా చోట్ల 17 సంవత్సరాల క్రితంనాటి నాసిరకం పైపులను బిగించడంతోనే అవి పగిలి నీటి సమస్య ఎక్కువవుతున్నట్లు తెలుస్తున్నది.



### కొద్దిసేపే వస్తున్నది..

మా కాలనీలో రోజు తప్పి రోజు నల్లా వస్తుంది. అది కూడా కొద్దిసేపు మాత్రమే వస్తుంది. నీటి సమస్య అధికంగా ఉండడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సమస్య తీర్చాలి.

**-సురేశ్, పంచముఖి హనుమాన్ కాలనీ**

### ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుకొంటున్నాం



మా కాలనీలో నీటి సమస్య అధికంగా ఉండడంతో కౌన్సిలర్లు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో ట్యాంకర్లు వచ్చినప్పుడు డ్రమ్ముల్లో నీటిని నింపుకొంటున్నాం. మున్సిపల్ అధికారులు వెంటనే నీటి సమస్యను తీర్చి మా ఇబ్బందులను తొలగించాలి.

**-కిష్టయ్య,పంచముఖి హనుమాన్ కాలనీ**

### నీటి సమస్యను పరిష్కరించండి..



మా కాలనీలో బోర్లు వేసినా.. ఎక్కువ సేపు నీరు వస్తలేవు. నల్లాలు కూడా రోజూ రావడం లేదు. దీంతో చాలా ఇబ్బంది ఎదుర్కొంటున్నాం. ఇప్పటికైనా అధికారులు వెంటనే నీటి సమస్యను తీర్చాలి.

**-భారతి, పంచముఖి హనుమాన్ కాలనీ**

### 3 ఎంఎల్‌డీ నీటి సరఫరా...



కామారెడ్డి పట్టణంలో 10 ఎంఎల్‌డీ బదులు 3 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేయడంతో ప్రజలకు నీటి సమస్య ఏర్పడుతున్నది. పైపులైన్ కూడా చాలా రోజులు కావడంతో పగిలిపోతున్నాయి. దీంతో రోడ్లపై నీరు వృథాగా పోతున్నది. త్వరలో నీటి సమస్యకు యాక్షన్ ప్లాన్ చేస్తున్నాం. త్వరలో ప్రజలకు నీటి కష్టాలు తొలగిపోతాయి.

**-సుజాత, మున్సిపల్ కమిషనర్, కామారెడ్డి**




ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న కౌన్సిలర్



ఘటన స్థలం వద్ద పడి ఉన్న మృతదేహాలు



శ్రీరాం పద్మ(ఫైల్)



పోశవ్వ(ఫైల్)

- కూతురిని కలిసేందుకు వచ్చి ఒకరు.. మనుమరాలి కోసం వచ్చి మరొకరు..
- ఎంజేపీ గురుకుల పాఠశాల వద్ద ఘటన
- విద్యార్థులకు గాయాలు



ప్రమాదానికి కారణమైన కారు

# కబళించిన కారు

## మహిళలపై నుంచి దూసుకెళ్లిన వాహనం.. ఇద్దరు మృతి

మాక్లూర్, జూలై 14: బిడ్డలకు గోరుముద్దలు తినిపించేందుకు వచ్చిన ఓ విద్యార్థి తల్లి, మరో విద్యార్థి అమ్మమ్మను విధి బలి తీసుకున్నది. మృత్యురూపంలో వచ్చిన కారు ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందిన ఘటన మాక్లూర్ మండలం దాస్‌నగర్‌లోని బాలికల గురుకుల పాఠశాల వద్ద ఆదివారం చోటు చేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. దాస్‌నగర్‌లోని మహాత్మాజ్యోతిబా పూలే రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, కళాశాలలో ప్రతి నెలా రెండో ఆదివారం తల్లిదండ్రుల సందర్శనకు అనుమతి ఉంటుంది. ఈ నేపథ్యంలో 8వ తరగతి చదువుతున్న ఈశ్వరిని చూసేందుకు బోధన్ మండలం చిన్నమావందికి చెందిన తల్లిదండ్రులు పద్మ,శంకర్, అక్క గౌతమి, ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న హారికను చూసేందుకు ఇందల్వాయి మండలం సిర్నాపల్లికి చెందిన తల్లి నీలా, అమ్మమ్మ పోశమ్మ వచ్చారు. తెచ్చిన భోజనాన్ని పిల్లలకు తినిపించేందుకు పాఠశాల బయటికి తీసుకువెళ్లారు. భోజనాలు ముగిసిన అనంతరం తిరిగి పాఠశాలలో వదిలేందుకు రోడ్డు వెంట వెళ్తుండగా నందిపేట నుంచి అతివేగంగా వస్తున్న టీఎస్ 16ఈఎక్స్1234 నంబర్ గల కారు అదుపుతప్పి వారిని ఢీకొట్టింది. దీంతో పద్మ(35), పోశవ్వ(60) అక్కడికక్కడే మరణించారు. పోశవ్వ కూతురు నీలా, మనుమరాలు హారిక, పద్మ కూతురు ఈశ్వరీకి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని దవాఖానకు తరలించారు. కారు నడిపిన వ్యక్తిని పట్టుకొని స్థానికులు దేహశుద్ధి చేయడంతో దవాఖాన తరలించారు. ఘటన స్థలాన్ని రూరల్ సీఐ సతీశ్, మాక్లూర్, నవీపేట్, రూరల్ ఎస్సైలు సుదీర్‌రావు, యాదగిరిగౌడ్,మహేశ్ పరిశీలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

### చిన్నమావందిలో విషాదం

బోధన్ రూరల్, జూలై 14: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీరాం పద్మ(35) స్వగ్రామం చిన్నమావందిలో విషాదం అలుముకున్నది. కూతురు ఈశ్వరి ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.

### మనుమరాలి కోసం వెళ్లి..

ఇందల్వాయి, జూలై 14: ఇందల్వాయి మండలం సిర్నాపల్లి గ్రామానికి చెందిన కొత్తూర్ పోశవ్వ మృతి చెందింది. కూలిపని చేస్తూ కూతురు, మనుమరాలిని చూసుకునే పోశవ్వ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

### ప్రమాద స్థలాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్

మాక్లూర్/ఖలీల్‌వాడి, జూలై14: గురుకుల పాఠశాల వద్ద జరిగిన ప్రమాద స్థలాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలల ఆర్సీవో సత్యనారాయణరెడ్డితో కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను విద్యార్థినులు, వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్న ఈశ్వరి, గౌతమిని అదనపు కలెక్టర్ అంకిత్ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.



దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరిస్థితి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ అంకిత్

### బోధన్ ప్రభుత్వ దవాఖానలో ఉచిత డయాలసిస్ సేవలు

### నూతన మిషన్లు ప్రారంభించిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

# మెరుగైన వైద్య సేవలందించాలి



బోధన్ ప్రభుత్వ దవాఖానలో డయాలసిస్ సేవలను ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

బోధన్, జూలై 14: ప్రభుత్వ దవాఖానకు వచ్చే వారికి మెరుగైన వైద్య చికిత్సలు నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు వైద్యులకు సూచించారు. బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ దవాఖానను ఆదివారం సందర్శించిన ఆయన.. నూతనంగా వచ్చిన రెండు డయాలసిస్ మెషిన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బోధన్ జిల్లా ప్రభుత్వ దవాఖానలో ఉచిత డయాలసిస్ సేవలు అందిస్తున్నామని, గతంలో ఐదు డయాలసిస్ మిషన్లు ఉండగా, కొత్తగా మరో రెండు మిషన్లు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. దీంతో రోజుకు సగటున ఇరవై మందికి డయాలసిస్ సేవలు అందించవచ్చని స్థానిక వైద్యులు కలెక్టర్‌కు వివరించారు. చుట్టు పక్క గ్రామాలు, మండలాల నుంచి డయాలసిస్ కోసం ఇక్కడికి వస్తారని, ఏకకాలంలో ఏడుగురికి డయాలసిస్ చేయవచ్చని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ దవాఖానాలపై నమ్మకాన్ని పెంచాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. అనంతరం దవాఖానలోని ఆర్వో ప్లాంట్, పోస్ట్ ఆపరేటివ్ వార్డుతోపాటు ఇతర విభాగాలను పరిశీలించారు. దవాఖానలో ఉన్న ఇన్‌పేషెంట్లను పరిశీలించి వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యుల కొరత ఉంటే కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకం కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు దవాఖానలో సీజనల్ వ్యాధుల నివారణకు సరైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ శివశంకర్, దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రహీం, ఆర్ఎంవో డాక్టర్ రాహుల్, బోధన్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, తహసీల్దార్ కె. గంగాధర్ పాల్గొన్నారు.

### ఐఐటీలో సీటు సాధించిన
# గురుకుల విద్యార్థినులు







అభినయ, బి.వర్ష, కృతజ్ఞ

డిచ్‌పల్లి, జూలై 14: ధర్మారంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ ప్రతిభ కళాశాలలో ఇటీవల ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ, సీఎఫ్‌టీఐలో సీట్లు సాధించినట్లు ప్రిన్సిపాల్ బి.సంగీత ఆదివారం తెలిపారు. ఇటీవల ప్రకటించిన సీట్ల కేటాయింపులో పి.అభినయ వారణాసిలో బీటెక్ ఫార్మాస్యూటికల్ ఇంజినీరింగ్‌లోని ఐఐటీ (బీహెచ్‌యూ), బి.వర్ష యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్), ఎన్.కృతజ్ఞ దర్వాడ్‌లోని ఐఐఐటీలో డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సీట్లు సాధించారని పేర్కొన్నారు. మరో విడుత కౌన్సిలింగ్, సీట్ల కేటాయింపు మిగిలి ఉన్నదని, దీంతో సీట్ల సంఖ్య పెరిగే అవకాశమున్నదన్నారు. సీట్లు సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులను రీజినల్ కోఆర్డినేటర్ అలివేలు, కళాశాల ప్రిన్సిపాల్ సంగీత, అధ్యాపక బృందం అభినందించారు.

## అపూర్వ సమ్మేళనం



మాక్లూర్, జూలై 14: సరిగ్గా 23ఏండ్ల క్రితం పదో తరగతి చదివిన విద్యార్థులంతా ఒక్కచోట కలిశారు. కాలినడకన పాఠశాలకు చేరుకున్న పరిస్థితులను మననం చేసుకున్నారు. విద్యార్థి దశలోని స్మృతులను గుర్తుచేసుకొని సంతోషంగా గడిపారు మాక్లూర్ జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు. 2001-02లో పదో తరగతి చదివిన వారంతా కలిసి మాక్లూర్ మండల కేంద్రంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయుల సేవలను గుర్తుచేసుకుంటూ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు అప్పల కిష్టయ్య, బాగేందర్, భూపతిరెడ్డి, మల్కయ్య, రవీందర్‌గుప్తా, వేణుగోపాల్, గంగారెడ్డి, వెంటక రాజయ్య, దామోదర్, పురుషోత్తం, దాస్ పాల్గొన్నారు.

### ఎస్సారెస్పీకి పెరిగిన ఇన్‌ఫ్లో

మోర్తాడ్/రెంజల్, జూలై 14: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వరద రాక పెరిగింది. శనివారం వరకు 1852 క్యూసెక్కులుగా ఉన్న వరద.. ఎగువ ప్రాంతంలో వర్షాలు కురుస్తుండడంతో ఆదివారం 3183క్యూసెక్కులకు చేరింది. ప్రాజెక్ట్ నీటిమట్టం 1091 అడుగులు కాగా ఆదివారం నాటికి 1062 అడుగులుగా నమోదైంది. పూర్తిస్థాయి నీటిమట్టం 80.5టీఎంసీలు కాగా 12.788 టీఎంసీల నీరున్నది. 494 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు.